



పేదల ఇళ్ల స్థలాలు, సాగుభూముల పట్టాల సమస్యలను ఆర్డీవోకు వివరిస్తున్న రాంభూపాల్



తుంగ'భద్రమే'నా..!

◆ భద్రపై ప్రాజెక్టులకు కేంద్రం నిధులు

◆ వర్షాభావ పరిస్థితుల్లో 'అనంత'కు ఇబ్బందులు తప్పవా..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తుంగభద్ర డ్యామ్ ఎగువ భాగంలో కర్నాటక చేపట్టిన భద్ర ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం 2023-24 బడ్జెట్‌లో రూ.5300 కోట్లు కేటాయించింది. తుంగభద్ర డ్యామ్‌పై తుంగ,భద్ర నదుల రెండూ కలిసి తుంగభద్రగా హొస్పేట్ వద్ద ఏర్పడుతాయి. కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మూడు రాష్ట్రాలకు నీటిని అందించే బహుళార్థక ప్రాజెక్టు ఇది. ఈ ప్రాజెక్టు ప్రారంభంలో 130 టిఎంసిల సామర్థ్యంతో నిర్మించారు. అయితే పూడిక కారణంగా ప్రస్తుతం దీని నీటి నిలువ సామర్థ్యం 100 టిఎంసిలకు పరిమితమైంది. ఈ ప్రాజెక్టు నుంచి అనంతపురం జిల్లాకు సాగునీటిని అందించే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ (హెచ్‌ఎల్‌సి) కర్నూలు జిల్లాకు సాగునీటిని అందించే తుంగభద్ర దిగువ కాలువ (ఎల్‌ఎల్‌సి)కు 70 టిఎంసిల నీటి కేటాయింపులున్నాయి. అందులో అనంతపురం జిల్లాకు మాత్రమే చూసినప్పుడు 32.50 టిఎంసిల నీరు కేటాయించారు. పూడిక కారణంగా తుంగభద్ర డ్యామ్‌లో నీటి నిలువ సామర్థ్యం తగ్గడంతో ఇప్పుడు ఏటా సగటున దామాషా పద్ధతిలో కేటాయిస్తున్న నీరు 23.50 టిఎంసిల వరకే ఉంటోంది. అనంతపురం జిల్లాకు వచ్చే ఈ నీటిలో పది టిఎంసిలకు పైగా తాగునీటి అవసరాలకే వాడుతున్నారు. నీటి ప్రవాహ నష్టం అన్నీ పోనూ ఆరేడు టిఎంసిల వరకే సాగునీటికి వినియోగిస్తున్నారు. దీంతో తుంగభద్ర డ్యామ్‌కు ఎగువ భాగంలో కర్నాటక రాష్ట్రం తుంగ, భద్ర నదులపై ప్రత్యేకంగా ప్రాజెక్టులు నిర్మిస్తుండటంతో ఆంధ్రప్రదేశ్‌కు కొన్ని అభ్యంతరాలూ ఉన్నాయి. డ్యామ్‌కి పైభాగంలో ప్రాజెక్టులు నిర్మిస్తే వర్షాలు అధికంగా వచ్చిన సమయంలో పెద్దగా సమస్య ఉండకపోవచ్చు. వర్షాభావ పరిస్థితులు నెలకొని ఆలస్యమైన సమయంలో ప్రాజెక్టులోకి నీరు రావడం ఆలస్యమయితే దిగువనున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, దిగువ ప్రధాన కాలువలకు నీటి విడుదలలోనూ జాప్యం జరిగే అవకాశాలున్నాయి. ఈ రెండు జిల్లాలు కూడా కరువు ప్రాంతాలుగానున్నవే కావడం గమనార్హం. తుంగభద్ర డ్యామ్‌లో నీరు రావడం ఆలస్యమయితే ఈ ప్రాంతాల్లో తాగునీటి సమస్య సైతం ఉత్పన్నమయ్యే అవకాశాలూ లేకపోలేదని నిపుణులు హెచ్చరిస్తుండటం గమనార్హం.

భద్రాపై ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి...
రూ.5300 కోట్లు కేటాయింపు..

రాయలసీమలోని కరువు ప్రాంతాలకు ప్రధానమైన తుంగభద్ర డ్యామ్‌కు పైభాగంలో చేపట్టిన ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.5300 కోట్ల నిధులను కేటాయించింది. 29.75 టిఎంసిల సామర్థ్యంతో కర్నాటక రాష్ట్ర ఈ ప్రాజెక్టును చేపట్టింది. ఇది పూర్తయితే సుమారు 30 టిఎంసిల నీరు ముందు భద్రాలో నిలువ అయిన తరువాత తుంగభద్ర డ్యామ్‌లోకి వస్తాయి. ఇటువంటి ప్రాజెక్టుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిధులు కేటాయించింది. వెనుకబడిన రాయలసీమ ప్రాజెక్టుల్లో ఒకటైన హంద్రీనీవాకు విభజన సమయంలో తోడ్పాటు అందిస్తామని చెప్పిన మాటను మాత్రం పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కర్నూలులో తుంగభద్ర దిగువను నిర్మించ తలపెట్టిన గుండ్రేవులకు నిధుల కేటాయింపులపై పెదవి విప్పకపోవడం ఆ ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారపార్టీ నేతలు పెదవి విప్పాలి
వి.రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి.

రాయలసీమ ప్రాంతానికి నష్టం జరిగే విధంగా కేంద్రంలోని బిజెపి అప్పర్ భద్రకు నిధులు కేటాయించడంపై రాష్ట్రంలోని అధికారపార్టీ వైసిపి నేతలు పెదవి విప్పాలి. ఇప్పటికే తుంగభద్ర పూడికతో జిల్లాకు నీటి కేటాయింపులు తక్కువగా ఉన్నాయి. మొదట దామాషా పద్ధతిలో కేటాయించి 32.50 టిఎంసిలు, కెసి కెనాల్ డైవర్షన్ ద్వారా రావాల్సిన పది టిఎంసిలు కలిపి జిల్లాకు 42.50 టిఎంసిలు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు రావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 25 నుంచి 27 టిఎంసిల్లోపే జిల్లాకు వస్తోంది. ఇటువంటి సమయంలో తంగభద్ర ఎగువ భాగంలో మరో ప్రాజెక్టు చేపడితే వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలో ఈ ప్రాంతానికి నీటిని తీసుకురావడంలో తీరని నష్టం జరుగుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు చేపట్టాలి. రాయలసీమ డిక్లరేషన్ గురించి మాట్లాడే బిజెపి నేతలు దీనిపై స్పందించాలి.

పేదల కోసం ఏ పోరాటానికైనా సిద్ధం

◆ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, సాగు పట్టాలు ఇవ్వాల్సిందే..

◆ 8 నుంచి తహశీల్దార్ కార్యాలయాల వద్ద గుడిసెలేస్తాం

◆ 9న పేదలకు స్థలాలు స్వాధీనం చేస్తాం ◆ సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్


◆ ముగిసిన 30 గంటల సత్యాగ్రహ దీక్ష ◆ ఆర్డీవో మధుసూదన్‌కు అర్జీల అందజేత

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'పేదలకు ఇళ్ల పట్టాలు, గృహాలు, సాగుదారులకు భూ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అనేక రోజులుగా వివిధ రూపాల్లో పోరాటాలు చేస్తున్నాం. అధికారులకు వినతిపత్రాలనూ ఇస్తున్నాం. అయినా ఫలితం లేకుండా ఉంది. పేదల సమస్యలపై అధికారులు, ప్రభుత్వం స్పందించకుంటే ఎంతటి పోరాటానికైనా సిద్ధం' అని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పేర్కొన్నారు. జిల్లాలో నిరుపేదలకు న్యాయపరంగా ఇళ్ల స్థలాలు, పట్టాలు, సాగుభూమి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన 30 గంటల సత్యాగ్రహ దీక్ష గురువారం ముగిసింది. జిల్లాలో పలు మండలాల నుంచి పేద కుటుంబాలు పిల్లలు, వృద్ధులు అందరూ కలిసి దీక్షలో పాల్గొని వారి గోడు వినాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శిబిరంలోనే మహిళలు, పిల్లలు, వృద్ధులు బుధవారం రాత్రి రోడ్డుపైనే చలిని తట్టుకుంటూ నిద్రించి నిరసన తెలిపారు. వంటా వార్పుతో అల్పాహారం, భోజనం చేశారు. గురువారం రెండవ రోజు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన సత్యాగ్రహ దీక్షలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ హాజరై మాట్లాడారు. జిల్లాలో వందలాది పేద కుటుంబాలు ఇళ్లు లేక అద్దె ఇళ్లలో ఉంటున్నారని తెలిపారు. అద్దెలు చెల్లించ లేక గుడారాలు వేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. ఏళ్ల తరబడి గుడిసెలు వేసుకుని జీవిస్తుంటే వారికి పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. పేరుకు లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామని ప్రభుత్వం చెప్పుకోవడమే తప్పా నిర్మించింది లేదన్నారు. జిల్లాలో 68 వేల ఇళ్లు నిర్మిస్తున్నామని ఇప్పటికీ 6 వేల ఇళ్లు నిర్మించారని, అవి ఇంకా పూర్తి కాలేదన్నారు. ప్రభుత్వ కొండగుట్ట సమీపాల్లోని భూములను సాగు చేసుకుంటుంటే పట్టాలు ఇవ్వడం లేదన్నారు. పైగా అటవీ భూములంటూ రెవెన్యూ అధికారులే కోర్టులో కేసులు పెడుతున్నారని తెలిపారు. ఖద్దరు చొక్క వేసుకునే ధనవంతులకు వేలాది ఎకరాలు ప్రభుత్వ భూములు ఎలా అప్పగిస్తారని మండిపడ్డారు. అధికారులు డబ్బుల మూటలకు ఆశపడి ప్రజలకు అన్యాయం చేస్తామంటే సహించలేది లేదన్నారు. పామిడి మండలంలో 22 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నా, పేదలకు ఇవ్వమంటే ఇవ్వలేదన్నారు. మరో వ్యక్తి పేరుతో పత్రాలు సృష్టించి దోచిపెట్టేందుకు యత్నించారన్నారు. కోర్టు విచారించి పేదలకు ఇవ్వమని తీర్పు ఇస్తే సదరు తమశీల్దార్ అటువైపు చూడకపోవడం విచారంగా ఉందన్నారు. ఇలాంటివి జిల్లాలో అనేకం ఉన్నాయని తెలిపారు. సత్యాగ్రహం శాంతియుతంగానే చేపట్టి పేదలకు న్యాయం చేయమని అడుగుతున్నామని, స్పందించకపోగే తీవ్ర పోరాటానికి దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. పోరాడితేనే, అవసరమైతే ప్రాణత్యాగం చేస్తేనే ఇళ్ల పట్టాలు ఇస్తామంటే తాము అందుకు కూడా వెనకాడబోమన్నారు. ప్రజల ప్రభుత్వమే అయితే తక్షణమే పేదలందరికీ ఇళ్ల పట్టాలు, స్థలాలు, సాగు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ నెల 8వ తేదీన జిల్లాలోని తహశీల్దార్ కార్యాలయాల పోరాట కేంద్రాలుగా గుడిసెలు ఏర్పాటు చేస్తామన్నారు. అప్పటికీ స్పందించకపోతే 9వ తేదీన తాము ఇది వరకే పక్కా ప్రభుత్వ భూములపై సమాచారం ఇచ్చిన మేరకు ఆ భూములను తాము ప్రజలకు స్వాధీనం పరిచి గుడిసెలు వేస్తామని హెచ్చరించారు. సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు, పట్టాల కోసం వందలాది కుటుంబాలు రెండు రోజులుగా సత్యాగ్రహ దీక్ష చేస్తుంటే ప్రభుత్వానికి పట్టడం లేదా అన్నారు. రోడ్డు ఎక్కాల్సిన దుస్థితిని ప్రభుత్వం కల్పించడం బాధాకరం అన్నారు. వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం చెబుతున్న గొప్పలకు అమలుకు ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. పేదల ప్రభుత్వమని చెబుతున్న ముఖ్యమంత్రికి ఈ పేదలు కనింపచడం లేదా అంటూ ప్రశ్నించారు. అర్హులైన పేదలందరికి ఇళ్ల పట్టాలు, స్థలాలు ఇచ్చేంత వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు.

వినతులు స్వీకరించిన ఆర్డీవో

సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సత్యాగ్రహం దీక్షపై జిల్లా యంత్రాంగం స్పందించింది. ఆర్డీవో మధుసూధన్ దీక్ష శిబిరానికి చేరుకుని సిపిఎం నాయకులతో మాట్లాడారు. ప్రజల అర్జీలను ప్రత్యేక స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో ఆయా మండలాల తహశీల్దార్‌లు పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు ఇస్తామని, సాగు భూములకు పట్టాలు మంజూరు చేస్తామన్నారు. ప్రభుత్వ భూములు కబ్జా అయ్యాయని రుజువైతే ఆ భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు. ఆర్డీవో హామీతో నాయకులు దీక్షను విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎస్.నాగేంద్రకుమార్, ఎం.బాలరంగయ్య, డి.శ్రీనివాసులు, వి.సావిత్రి, బి.శ్రీనివాసులు, నాగమణి, క్రిష్ణమూర్తి, తరిమెల నాగరాజు, శివకుమార్, సూరి, సిపిఎం నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యచంద్రయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, సిపిఎం నాయకులు ముస్కిన్, వలీ, బాబు, మసూద్, ప్రకాష్‌రెడ్డి, వెంకటనారాయణ, పోతులయ్య, రామాంజినేయులు, రామాంజినమ్మ పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న పేద కుటుంబాలు

అధ్యాపకుల ప్రతిభకు పరిశోధన ప్రాజెక్టు కొలమానం

ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి

అనంతపురం : అనంత జెఎన్‌టియు పరిధిలోని అధ్యాపకులు పరిశోధన ప్రాజెక్టులను సాధించే దిశగా అడుగులు వేయాలని, అప్పుడే వర్శిటీ మరింత అభివృద్ధి సాధిస్తుందని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం వర్శిటీ ఉపకులపతి ఛాంబర్‌లో యూనివర్సిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్శిటీ అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. అలాగే పరిశోధన కార్యకలాపాలను అధ్యాపకులు మరింత ముందుకు తీసుకెళ్లే విధంగా కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థులకు మైనర్స్, డిగ్రీ, హానర్స్ డిగ్రీపైన మరింత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఇంటర్నెషిప్ పూర్తి చేసేలా ప్రతి అధ్యాపకుడూ పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, యూనివర్సిటీ డైరెక్టర్లు వి.సుమలత, ఇ.కేశవరెడ్డి, కిరణ్మయి, సి.శోభాబిందు, భువన విజయ, పద్మ సువర్ణ, సుబ్బారెడ్డి, ఎ.సురేష్‌బాబు, బి.ఈశ్వర్‌రెడ్డి, అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ భవానీ, వర్సిటీ పీఆర్‌ఓ ఎం.రామశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పశువుల అంబులెన్స్ ప్రారంభం

బొమ్మనహాల్ : మండలంలోని మైలాపురం గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పశువుల అంబులెన్స్‌ను విప్ కాపు రామచంద్రారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషులతో పాటు పశువులకు సైతం ఉచిత వైద్య అంబులెన్స్ ఏర్పాటు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పశువులకు చికిత్సతోపాటు అత్యవసర సేవలు, ఆపరేషన్లు అవసరమైన వారు 1962 నెంబర్‌కు ఫోన్ చేస్తే వారే వచ్చి ఉచితంగా వైద్య సేవలు అందిస్తారన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, పశువైద్య డాక్టర్ వెంకటరెడ్డి, సచివాలయ సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

రైతులను చైతన్యం చేయడమే 'జీవనరేఖ' లక్ష్యం

జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్



రైతులకు పత్రాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్

అనంతపురం : వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడులు తిరిగి రాక నిస్సహాయులైన రైతులు ఆత్మహత్య వైపు వెళ్లకుండా చైతన్య పరిచేందుకే జీవన రేఖ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.చంద్రానాయక్ తెలిపారు. గురువారం అనంతపురం రూరల్ మండలంలోని చియ్యేడు గ్రామంలో జీవన రేఖ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో భాగమైన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. సరైన సమయంలో సాంకేతిక సలహాలు అందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందన్నారు. అంతేగాకుండా సకాలంలో పంట రుణాలు చెల్లించే రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం, వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాలు అందించడం, రైతులపై ఎలాంటి ఆర్థికభారం పడకుండా వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పతకం ద్వారా రైతులందరి తరపున బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు భానూజా, అనంతపురం వ్యవసాయ డివిజన్ ఎడిఎ వెంకటరాముడు, మండల వ్యవసాయ అధికారి పి.వెంకటేశ్వరప్రసాద్, ఎఇఒలు ప్రసాద్, మురళి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ భువనేశ్వరి, గ్రామా రైతులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి-శింగనమల

నేరాల నియంత్రణపై ప్రత్యేక నిఘా ఉంచి, శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ డా॥ఫక్కీరప్ప కాగినెల్లి పోలీసు సిబ్బందికి సూచించారు. శింగనమల పోలీసు స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, నేరాలు, శాంతిభద్రతలపై సమీక్ష నిర్వహించారు. పోలీసు స్టేషన్ పరిసరాలు, పోలీస్ స్టేషన్‌లోని లాకప్‌గది, కంప్యూటర్ గది, రిసెప్షన్ సెంటర్, తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. పోలీసు స్టేషన్లో జిడి(జనరల్ డైరీ)ను ఎస్ఐ స్వయంగా రాయాలని సూచించారు. సైబర్ పోర్టల్‌లో తరుచూ లాగిన్ అయ్యి ఏవేని సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉంటే తక్షణమే స్పందించాలన్నారు. ఇతర ప్రభుత్వ విభాగాలతో కలసి బాల్యా వివాహాలపై ప్రజల్లో అవగాహన తేవాలన్నారు. మిస్సింగ్ కేసులు, మహిళలు,చిన్న పిల్లలపై జరిగే నేరాలు, సైబర్ నేరాలు, అక్రమ నాటుసారా తయారీ తదితర వాటిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఇక పోలీసు స్టేషన్లకు వచ్చే పిటీషనర్ల పట్ల మర్యాదగా, జవాబుదారీగా వ్యవహరించి, చట్టపరిధిలో సమస్యలకు పరిష్కరం చూపాలని సిబ్బందికి సూచించారు.

సచివాలయాల తనిఖీ

శింగనమల గ్రామ సచివాలయాన్ని ఎస్పీ ఫక్కీరప్ప పాల్గొన్నారు. సచివాలయ మహిళా పోలీసులు సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడారు. వారి విధులు, ప్రజలకు ఎలాంటి సేవలు అందుతున్నాయన్న విషయాలపై ఆరా తీశారు. ప్రజలకు అందించే పోలీసు సేవలు గురించి ప్రతీ గ్రామ సచివాలయ పట్టికలో సూచించాలన్నారు. ఈ కార్యక్రమంలో శింగనమల సిఐ అస్రార్‌బాషా, ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.



శింగనమల పోలీసు స్టేషనలో లాకప్‌గదిని పరిశీలిస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప

వ్యవసాయ రంగాన్ని దగా చేసిన మోడీ

రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన



బడ్జెట్ ప్రతులను చించి నిరసన తెలుపుతున్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి బడ్జెట్ కేటాయింపులో కోతలు విధించి దగా చేసిదని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య విమర్శించారు. బడ్జెట్ కేటాయింపుల్లో వ్యవసాయ రంగానికి కోతలు విధించడాన్ని వ్యతిరేకిస్తూ ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో గురువారం నగరంలోని రైతు బజార్ నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతు కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రైతాంగానికి అన్యాయం జరిగిందన్నారు. రాయలసీమ రైతాంగానికి 100 శాతం సబ్సిడీతో డ్రిప్పు, స్ప్రింకర్లు హంద్రీనీవాకు నిధులు కేటాయించలేదన్నారు. కేంద్ర బడ్జెట్ ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ రూ.45 లక్షల కోట్ల ప్రవేశపెట్టారని తెలిపారు. వ్యవసారంగానికి తీవ్ర నష్టం కలగచేసే బడ్జెట్‌గా ఉందన్నారు. ఓ పక్కన లక్షలాది మంది రైతులు ఆత్మహత్య పరంపర కొనసాగుతూ ఉంటే మరోకపక్క స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం సీటు ప్లస్ 50 ప్రకారం మద్దతు ధరలను ఇస్తామని ప్రధాని మోదీ ప్రకటించారన్నారు. ఈ బడ్జెట్‌లో ఆ ఊసే ఎత్తలేదన్నారు. వ్యవసాయ రంగానికి కేటాయించిన 2023లో 1.51 లక్షల కోట్లు కేటాయించగా ఈ ఏడాదిలో 1.37 లక్షల కోట్లు కేటాయించారన్నారు. ఎరువులపై సబ్సిడీ గతం కంటే రూ.50 వేల కోట్లు తగ్గించారని, ధాన్యం సేకరణ, ఆహార సబ్సిడీలు ఘనంగా తగ్గించేశారన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు కోతలు విధించిందన్నారు. తక్షణమే వ్యవసాయ రంగానికి నిధులు కేటాయించి ఆంధ్ర రాష్ట్ర విభజన హామీలు నెరవేర్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం బిహెచ్.రాయుడు, నల్లప్ప, రాయుడు, పోతులయ్య, నాగమ్మ, చెన్నారెడ్డి, యల్లనూరు, ఓబిలేసు, రమేష్, లక్ష్మీదేవి, చంద్ర, సుబద్రమ్మ, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకానికి కోతలే..

ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో కోతలు విధించడం దుర్మార్గంగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధుల కోతలను నిరసిస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బడ్జెట్ నమూనా ప్రతులను చింపి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో పేదలకు ఉపాధి హామీ కూలీలకు పెద్ద ఎత్తున మోసం చేసిందన్నారు. గతంలో రూ.89 వేల కోట్లు కేటాయించగా ఈ బడ్జెట్‌లో రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించి మోసం చేసిందన్నారు. నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సూరి, ఎం.కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి భాస్కర్, ఓబులేసు, మల్లేసు, మున్నీ, కమిటీ సభ్యులు శంకర్, కరీం, చితంబరమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల విద్యా పథకానికి భారీ కోత..

కోత విధించి కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తోందని ఆవాజ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వలి, ముస్కిన్ అన్నారు. ఆవాజ్ ఆధ్వర్యంలో రేడియో కేంద్రం వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. మదర్సాలు, మైనారిటీలకు విద్యా పథకానికి కేటాయింపుల్లో భారీ కోత విధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 2022-23 కేంద్ర బడ్జెట్ రూ.160 కోట్లు కేటాయించగా 2023-24లో కేవలం రూ. 10 కోట్లు మాత్రమే కేటాయించి వివక్ష చూపిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ నగర అధ్యక్ష కార్యదర్శులు మసూద్, ఇర్ఫాన్, జిల్లా నాయకులు బాబు, గఫూర్, శర్మాస్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు

రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను సిఎం జగన్ కేంద్ర ప్రభుత్వానికి తాకట్టు పెట్టారని, ఇందుకు బడ్జెట్‌లో కోతలే ఇందుకు నిదర్శనమని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర విభజన తరువాత రాష్టానికి రావాల్సిన న్యాయ బద్ధమైన హక్కులను, వాటాను తీసుకురావడంలో ఏటేటా ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. గతంలో టిడిపి చేసిన తప్పులే వైసిపి ప్రభుత్వం చేస్తోందన్నారు. ముఖ్యంగా రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తర ఆంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, కేంద్రీయ విద్యా సంస్థలు, రైల్వే జోన్, కడప ఉక్కు పరిశ్రమ, సాధించడంలో నాలుగేళ్ల వైసిపి పాలనలో పూర్తిగా విఫలమయ్యారన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

సెంట్రల్ యూనివర్సిటీకి మరోసారి మోసం

అనంతపురం సెంట్రల్ యూనివర్శిటీ ఏర్పాటు, అభివృద్ధి కోసం నిధులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసిందని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ అన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో సెంట్రల్ యూనివర్సిటీకి కోతలు విధించడాన్ని వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం సెంట్రల్ వర్సిటీకి బిజెపి ప్రభుత్వం మరోసారి మోసం చేసిందన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో జిల్లాకు సెంట్రల్ యూనివర్సిటీ కేటాయించారని, 8 సంవత్సరాలు కావస్తున్నా ప్రహరీ కూడా నిర్మించలేదన్నారు. కనీసం సొంత భవనం కూడా లేని పరిస్థితుల్లో తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు వర్శిటీలో చదువుకోవాలని వచ్చిన వారికి సమస్యల నడుమ చదవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. 2022లో వర్శిటీకి రూ.56.6 కోట్లు కేటాయించారని, ఆచరణలోకి వచ్చేటప్పటికీ ఆ నిధులు కేవలం రూ.13.08 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని గుర్తు చేశారు. ఈ బడ్జెట్‌లో రూ.47.40 కోట్లు కేటాయించారని, విడుదల అయ్యేది ఎంత అన్నది ప్రశ్నార్థకంగా ఉందన్నారు. ఇప్పటి వరకు సెంట్రల్ యూనివర్సిటీలో కనీసం మౌలిక సదుపాయాలు కూడా లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని అయినా ప్రభుత్వం కేంద్రీయ విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయింపులు జరపడం లేదన్నారు. బిజెపి ప్రభుత్వం సెంట్రల్ యూనివర్సిటీకి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తరిమెల గిరి, విజయ్, కిరణ్, రాజేష్, అనిల్, గౌసియా, రజిత, శిరీష, శివమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎపికి తీవ్ర అన్యాయం

అనంతపురం : కేంద్ర ప్రభుత్వం, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ రాష్టానికి తీరని అన్యాయం చేశారని టిడిపి బిసిసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు పేర్కొన్నారు. విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్టానికి విభజన హామీల మేరకు బడ్జెట్‌లో నిధుల కేటాయించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌పై నోరు మెదపకపోవడం ఆందోళనకరంగా ఉందన్నారు. ఎంపీలు 31 మంది ఉన్నప్పటికీ ప్రయోజనం చేకూరలేదన్నారు. అంతేగాకుండా స్వయంగా ఆర్థిక ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కేంద్ర బడ్జెట్ బాగుందని ప్రశంసించడం రాష్ట్ర ప్రభుత్వ డొల్లతనాన్ని బహిర్గతం చేసినట్లుగా ఉందన్నారు.



బహుమతులతో చిన్నారులు

'శ్రీ చైతన్య'లో ప్రీ ప్రైమరీ స్పోర్ట్స్ కిడ్స్

అనంతపురం : నగరంలోని ఏటీపీ-8లో ప్రీ ప్రైమరీ స్పోర్ట్స్ కిడ్స్ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ చైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి హాజరై స్పోర్ట్స్ గురించి పిల్లలకు అనేక విషయాలు తెలియజేశారు. అనంతరం స్పోర్ట్స్‌లో గెలుపొందిన పిల్లలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నేత్రావతి, డీన్ అరుణ్ కిరణ్, కోఆర్డినేటర్ తిరుమలేశ్వర్, సబిత, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జులు దేవికృప, రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

పుట్లూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి ఆధ్వర్యంలో విద్య, వైద్య సదుపాయాలపై వెల్ఫేర్, హెల్త్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు సుమతి, వైద్యాధికారి శ్రీవాణి, ఈవోఆర్డీ ఆనంద ప్రసాద్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల, సచివాలయాల తనిఖీ

రాయదుర్గం : మండలంలోని ఆవులదట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కళ్యాణదుర్గం డివిజినల్ అభివృద్ధి అధికారి శంకర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంత సంకల్పం కార్యక్రమంలో భాగంగా పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అలాగే మండలంలోని 74-ఉడేగోళం, ఆవులదట్ల, బిఎన్ హళ్లి, వడ్రహోన్నూరు గ్రామ సచివాలయాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్రజల భద్రతలకు భరోసా కల్పిద్దాం

అనంతపురం సిటీ : ప్రజల భద్రతకు భరోసా కల్పిద్దామని ఎస్‌పి ఫక్కీరప్ప కాగినెల్లి ఆదేశించారు. గురువారం స్థానిక పోలీస్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ అధికారులతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్ల గుండా ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బృందాలచే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ప్రజల్లో భద్రత, విశ్వాసం కలిగేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఇ. నాగేంద్రుడు, 99వ బెటాలియన్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ వినోద్, అసిస్టెంట్ కమాండెంట్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి

ఉరవకొండ : కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కలిసికట్టుగా కృషి చేయాలని విడపనకల్ పిహెచ్‌సి వైద్యాధికారి శ్రీధర్ పేర్కొన్నారు. కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాలను విడపనకల్ మండలలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది నూర్, శ్రావణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సామాన్యులకు కోతలు..సంపన్నులకు వరాలు

సిపిఎం ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతుల దహనం

ప్రజాశక్తి-గుంతకల్లు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మాయా బడ్జెట్ సామాన్యులకు కోతలు, సంపన్నులకు వరాలు అన్న చందంగా ఉందని సిపిఎం మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు ఎద్దేవా చేశారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సిపిఎం నాయకులు గుంతకల్లు ఆర్టీసి బస్టాండు కూడలిలో బడ్జెట్ ప్రతులను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సిపిఎం పూర్తిగా వ్యతిరేకిస్తోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పట్ల మోడీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. ఈ ఏడాది అయినా బడ్జెట్‌లో రాష్టానికి ఆశాజనకంగా ఉంటుందని రాష్ట్ర ప్రజలు ఉండగా కేంద్రం మరోసారి మొండిచేయి చూపిందన్నారు. ఈ బడ్జెట్‌పై సిఎం జగన్‌రెడ్డి నోరు మెదపలేదన్నారు. ఉపాధి హామీ నిధులలో 50 శాతం కోత విధించడం దుర్మార్గం అన్నారు. రైతులకు ఎరువుల సబ్సిడీలో కోతలను విధిస్తూ సామాన్యులకు పెను భారంగా ఈ బడ్జెట్ ఉందన్నారు. పేదలకు, రైతులకు, కార్మికులకు ఉపయోగపడే బడ్జెట్ వెంటనే ప్రతిపాదించాలన్నారు. బడ్జెట్‌లో నిరుద్యోగుల ఊసే లేకపోవడం అన్యాయమన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, కడప ఉక్కు, రైల్వే జోన్, విశాఖ స్టీల్ ప్లాంట్ నిధుల ప్రస్తావనే లేదన్నారు. జిల్లాలోని కేంద్రీయ విశ్వవిద్యాలయానికి అరకొర నిధులు కేటాయించడం అన్యాయమన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ నాయకులు మారుతి ప్రసాద్, సాకే నాగరాజు, తిమ్మప్ప, వెంకీ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే పెద్దారెడ్డి



ఎమ్మెల్యేకి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో సమగ్ర అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మేడిమాకులపల్లి గ్రామంలో ప్రజా సంక్షేమయాత్రను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కండ్లగూడూరు గ్రామంలో ఎమ్మెల్యేకి పూల వర్షం కురిపించి స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు పెద్దపీట వేసిందన్నారు. రైతుల కష్టాలను తీర్చడానికి రైతు బరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందని అన్నారు. పంటలకు ఎలాంటి తెగుళ్ల వచ్చినా అగ్రికల్చర్ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివారణకు అవసరమైన. మందులను పిచికారీ చేయాలని సూచించే బృహత్కర కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సిఎం రైతుల పక్షపాతిగా ఉన్నారన్నారు. జేసీ సోదరులు అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు రైతాంగానికి నీళ్ల విడిచిన దాఖలాలు లేవన్నారు. ప్రజలు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకొని అభివృద్ధిని కోరుకునే వారిని ఎన్నుకోవాలని సూచించారు. అనంతరం సి. రామరాజుపల్లి మీదుగా రాంపురంకు యాత్ర చేరుకొంది. ఈ కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, మాజీ జెడ్పిటిసి చిదంబరరెడ్డి, మండల కన్వీనర్ శరభరెడ్డి, శేషానందరెడ్డి, వెంకట స్వామిగౌడ్, పాశం రంగస్వామి, రామచంద్రారెడ్డి, మదనమోహన్ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి అధికారుల అడ్డు..

ప్రజాశక్తి-నార్పల

దేవుడు వరమిచ్చినా..పూజారి కనికరించడంలేదన్న చందంగా మారింది నార్పల మండలంలోని ఇళ్ల నిర్మాణాల లబ్ధిదారుల పరిస్థితి. నార్పల మండల కేంద్రంలోని క్రాసింగ్ లేఅవుట్‌లో 312 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా ఆర్భాటంగా ఇచ్చారు. పలువురు లబ్ధిదారులు తమకు కేటాయించిన స్థలంలో అప్పులు చేసి పునాదులు సైతం వేసుకున్నారు. తమ అనుమతి లేకుండా పునాదులు ఎలా వేస్తారు..వాటిని తొలగించాలని ఇప్పుడు అధికారులు చెబుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. దీనిపై హౌసింగ్ ఏఈ నవీన్‌కుమార్‌ను వివరణ కోరగా..చాలామంది లబ్ధిదారులు వారికి కేటాయించిన దానికంటే ఎక్కువ స్థలంలో సరైన కొలతలు లేకుండా పునాదులు వేసుకుని నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. దీంతో పట్టాలు పొందిన ఇతర లబ్ధిదారులు నష్టపోతారన్న ఉద్దేశంతోనే ఇళ్ల నిర్మాణాలను నిలిపివేశామని పేర్కొంటున్నారు. కొలతలు సరిచూసి నిర్మాణ పనులు జరిగేలా చూస్తామని చెప్పారు. నార్పల మండలంలోని 17 పంచాయతీలలో ఈఎంఏవై గ్రామీణ పథకం కింద 329 ఇళ్ల నిర్మాణానికి అనుమతి వచ్చిందన్నారు. వాటి పనులు కూడా జరుగుతున్నాయన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో నార్పల విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-నార్పల

మహాత్మ జ్యోతిబాపూలే ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లా సింహాచలంలో జరిగిన రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో నార్పల మండల కేంద్రంలోని బిసి గురుకుల పాఠశాల విద్యార్థులు రన్నరప్‌గా నిలిచారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు సత్తాచాటడం గర్వకారణమని ప్రిన్సిపల్ సంగీత కుమారి అన్నారు. విద్యార్థినులు ఇంతటి ఘన విజయం సాధించడానికి కృషిచేసిన పిఇటి శివమ్మని అభినందించారు.

పంతులకాలనీ పాఠశాలను టెన్త్ వరకు అప్‌గ్రేడ్ చేస్తాం

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రుద్రంపేట పంచాయతీ పంతులు కాలనీలోని మండల పరిషత్ పాఠశాలలో పదోతరగతి వరకు క్లాసులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని స్థానిక పంతుల కాలనీలో చేపట్టారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వాటర్ ట్యాక్ నుంచి నీరు లీకేజీ అవుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్థానిక మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 405 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, 9, 10 తరగతులు చదివేందుకు నగరానికి వెళ్లాల్సిరావడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో పేద విద్యార్థుల చదువు మధ్యలో ఆగిపోయే పరిస్థితులు ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. తొమ్మిది, పది తరగతులు ఇక్కడే నిర్వహించేలా పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏ చిన్న సమస్యతో కూడా విద్యార్థుల చదువు మధ్యలో ఆగకూడదన్న ఉద్దేశంతో సిఎం జగన్ నాడు- నేడు కింద పాఠశాలల ఆధునీకరణ, అమ్మఒడి, గోరుముద్ద, ఇంగ్లీష్ మీడియం చదువు లు ప్రవేశ పెట్టారన్నారు. పంతులు కాలనీ పాఠశాలను కూడా అప్ గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచి సుగాలి పద్మావతి, ఉప సర్పంచి నరేంద్రరెడ్డి, వైస్ ఎంపీపీ బాలాజీ, పంచాయతీ కార్యదర్శి నరసింహారెడ్డి, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ఓబులపతి, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ ఆలమూరు గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచి కుళ్లాయప్ప, వైసీపీ నాయకులు తిరుపతి నాయుడు, సాదిక్‌వలి, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనంత

చిరుధాన్యాల సాగుతో ప్రయోజనాలు మెండు

ఉరవకొండ ఎడిఎ పద్మజ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఉరవకొండ

చిరుదాన్యాల సాగుతో ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయని ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ పేర్కొన్నారు. ప్రపంచ చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకొని విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకుముందు గ్రామంలోని పలు వీధులలో విద్యార్థులతో కలిసి చిరుధాన్యాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించేలా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ.. చిరుధాన్యాల్లో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. చిరుధాన్యాల పంటలైన జొన్న, సజ్జ, కొర్ర, రాగులు, సామలు, వరిగ, ఆరిక, ఊదలు, అండు కొర్రలు లాంటి తొమ్మిది రకాల చిరుధాన్యాలను భారతదేశం అత్యధికంగా ఉత్పత్తి చేస్తూ ప్రపంచలంలో అగ్రగామిగా ఉందన్నారు. చిరుధాన్యాల ఆవశ్యకతను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం జీవో 28 విడుదల చేసిందన్నారు. చిరుధాన్యాలకు రూ.2500 మద్దతు ధర ప్రకటించిందన్నారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడమే కాకుండా పొలాలలో పంటలు వేయడానికి రైతులు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు, సర్పంచి బ్యాలారాణి రాజశేఖర్, మండల వ్యవసాయాధికారి పెన్నయ్య, డిఆర్‌సి శైలజ, ఏవో రుమనాబేగం, ఎఈఒ రాఘవేంద్ర, ఏపీసీఎన్ఎఫ్, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే ధ్యేయం : విప్ కాపు

ప్రజాశక్తి-బొమ్మనహాల్


పేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని విప్ కాపు రామాచంద్రారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కొలగానహళ్లి గ్రామంలో సర్పంచి శృతి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్ల ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు దళితులు తమ భూములను ఇతరులకు పంచి పెడుతున్నారని వాపోయారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే పూర్తిస్థాయిలో విచారించి అర్హులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అలీఆగే గ్రామంలో దళితులకు శ్మశానవాటిక లేదని, స్థలం చూపించాలని విజ్ఞప్తి చేశారు ఆ విషయమై పరిశీలించి న్యాయం చేయాలని తహశీల్దార్ శ్రీనివాసులును ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రవేశపెట్టిన పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా.. లేదా.. అని తెలుసుకునేందుకే సిఎం జగన్ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. తద్వారా ఎంతమంది పథకాల ద్వారా లబ్ధిపొందుతున్నారు.. అర్హులకు ఎవరికైనా పథకాలు రాలే.. ఏమైన ఇబ్బందులు ఉన్నాయా.. అని ఇంటింటికీ వెళ్లి తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ షకీలాబేగం, తహశీల్దార్ శ్రీనివాసులు, నాయకులు ఈశ్వర్‌రెడ్డి, జయరామిరెడ్డి, జొంప నాయుడు, ఎంపిటిసి తిమ్మప్ప, ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కుందుర్పి : రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉషాశ్రీచరణ్ తెలిపారు. గురువారం మండలకేంద్రంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్ల ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంట్లో లబ్ధి చేకూరుతున్నాయన్నారు. సరాసరి ప్రతి ఇంటికీ రూ.లక్ష సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మారుతీశ్వరి రామమూర్తి, ఎంపిపి కమల నాగరాజు, జడ్పిటిసి రాధాస్వామి, మండల మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, వైస్ ఎంపిపి బిజి సోమనాథ్, శ్రీలక్ష్మీ అజయ్‌బాబు, కేపీ గోపాల్, కురుబ సంఘం మండల అధ్యక్షుడు, బూత్ మండల కన్వీనర్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.



బుక్‌లెట్లు అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

సత్యసాయి కార్మికుల వినూత్న నిరసన



గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న కార్మికులు

ఉరవకొండ : సత్యసాయి కార్మికులకు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని యూనియన్ ఉపాధ్యక్షులు బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఉరవకొండ మండల పరిధిలోని పెద్ద కౌకుంట్ల గ్రామంలో సత్యసాయి యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు గురువారం రెండవ రోజూ కొనసాగాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నెలల తరబడి కార్మికులతో పనులు చేయించుకుని జీతాలు ఇవ్వకుండా వారి జీవితాలతో చెలగాటమాడడం సరికాదన్నారు. సకాలంలో జీతాలు ఇవ్వకపోతే తాము, కుటుంబ సభ్యులు గడ్డి తినాల్సిన పరిస్థితి వస్తుందని గడ్డి తింటూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్మికులకు రావాల్సిన గ్రాడ్యుటీ ఫండ్‌తో పాటు పిఎఫ్, ఇఎస్ఐ గుర్తింపు కార్డులు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి తాగునీటి పథకం యూనియన్ నాయకులు మల్లికార్జున, శీనప్ప, బొజ్జప్ప, రంజిత్, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

భీమారెడ్డి విగ్రహావిష్కరణకు తరలిరండి

ఎమ్మెల్సీ వై.శివరాంరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, తన తండ్రి వై.భీమారెడ్డి శిలా విగ్రహం ఆవిష్కరణకు తరలిరావాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈనెల 6వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు గుంతకల్లు సమీపంలో హనుమాన్ జంక్షన్ కొనకొండ్ల-గుంతకల్ సర్కిల్లో తన తండ్రి భీమారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని చెప్పారు. తమ తండ్రి యల్లారెడ్డి భీమరెడ్డి ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేశారన్నారు. ఆ నిస్వార్థ సేవనే ఆయనను 1983లో స్వతంత్ర్య అభ్యర్థిగా ఉరవకొండ ఎమ్మెల్యేగా గెలుపొందేలా చేసిందన్నారు. ఆయన వారసులైన తాము తమ తండ్రి వారసత్వాన్ని పునికిపుచ్చుకుని రాజకీయంగా ప్రజాసేవలోనే ఉన్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ భూగర్భ గనులు, అటవీ, విద్యుత్ శాఖామాత్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతులమీదుగా శిలా విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, గుమ్మనూరు జయరాం, ఉషశ్రీ చరణ్ , ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని తెలిపారు. అభిమానులు, శ్రేయోభిలాషులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్యాయత్నం

కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి-శింగనమల

కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తిచెంది శింగనమల చెరువులోకి దూకి ఆత్మహత్యాయత్నానికి యత్నించిన మహిళను పోలీసులు గురువారం కాపాడారు. అనంతపురం విద్యానగర్‌కు చెందిన ఓ మహిళ గురువారం శింగనమల చెరువుకు చేరుకుంది. తన భర్తకు వీడియో కాల్‌చేసి చెరువులో దూకి చనిపోతానని తెలియజేసింది. ఆమె భర్త వెంటనే డయల్-100కు సమాచారం అందించారు. శింగనమల ఎస్ఐ శ్రీనివాసులు స్పందించి తమ కానిస్టేబుళ్ల ఇక్బాల్ బాషా, ఆరిఫ్‌లను హుటాహుటిన శింగనమల చెరువు వద్దకు పంపి ఆమెను రక్షించారు. అనంతరం ఆమె భర్తను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మహిళను కాపాడిన శింగనమల పోలీసులను ఎస్పీ ఫక్కీరప్ప అభినందించారు.

తాగిన మైకంలో బైకుకి నిప్పు

ప్రజాశక్తి-పుట్లూరు

తాగిన మైకంలో ఓ వ్యక్తి తన సొంత మోటారు సైకిల్‌పై పెట్రోల్ పోసి దహనం చేసిన సంఘటన పుట్లూరు మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తక్కలపల్లి గ్రామానికి చెందిన లక్ష్మినారాయణ తాగిన మైకంలో తన సొంత ద్విచక్రవాహనంపై పెట్రోల్ పోసి దహనం చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఔషధ దుకాణాల్లో అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఔషధ దుకాణాల్లో సంబంధిత అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నిబంధనలను పాటించని పలు ఔషధ దుకాణాలను తాత్కాలికంగా మూసివేశారు. దీనిపై జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ రమేష్‌రెడ్డి ప్రజాశక్తితో మాట్లాడుతూ. ప్రభుత్వ నిబంధనలు పాటించని 10 దుకాణాల దారులకు తాత్కాలిక సస్పెన్షన్ నోటీసులను అందజేశామని చెప్పారు. అనంతపురంలోని కీర్తి, శివశంకర్, మెడ్ ప్లస్ వంటి ప్రధాన ఔషధ దుకాణాలు, సాధారణ దుకాణాలను మూయించామన్నారు. మరో రెండు రోజుల్లో ఉభయ జిల్లాల్లో తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఔషధ దుకాణాలు నిర్వహిస్తున్న వారు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు. ఈ తనిఖీల్లో అనంతపురం ఔషధ నియంత్రణ శాఖ డిఐ హనుమప్ప, కర్నూలు డిఐ, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసప్ప సస్పెన్షన్ బాధాకరం

ప్రజాశక్తి-పుట్లూరు

సత్యసాయి జిల్లా జిల్లా గోరంట్ల మండలం వెంకటరమణపల్లి మాజీ సర్పంచి, అఖిల భారతీయ యాదవ మహాసభ ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు శ్రీ లక్ష్మీనరసప్పని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరణ చేస్తున్నట్లు చేసిన ప్రకటన యాదవ జాతిపై ఆపార్టీ చేస్తున్న దాడిగా పరిగణిస్తున్నామని యాదవ సంఘం అనంతపురం జిల్లా కార్యదర్శి వెంకటరమణ యాదవ్ అన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. లక్ష్మీనరసప్ప పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు ఏం చేశారో చెప్పకుండా బహిష్కరించడం సరికాదన్నారు. బిసి చైతన్య కార్యక్రమాల్లో పాల్గొనడమే లక్ష్మీనరసప్ప వైసిపికి చేసిన వ్యతిరేక చర్యా, యాదవ సంఘం నాయకులను కలవడం ఆయన చేసిన నేరమా? అని ప్రశ్నించారు. వైసిపిలో సభ్యులుగా ఉంటూ యాదవ సంఘాలు, బిసి సంఘాలలో పనిచేస్తున్న వారినందరినీ బహిష్కరించగలరా అన్నారు. యాదవులపై, బిసిల ఆత్మగౌరవం పై వైసిపి చేస్తున్న దాడులకు తగు ప్రాయశ్చిత్తం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అనంతపురం జిల్లా కార్యదర్శి రమణ యాదవ్, మండల యాదవ సంఘం అధ్యక్షుడు నాగేంద్ర యాదవ్, రవి యాదవ్, విశ్వనాథ యాదవ్, ఇతర బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వారపు సంత స్థల పరిశీలన

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఆత్మకూరు మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం వద్ద ఈనెల 5వ తేదీ నుంచి నిర్వహించనున్న వారాంతపు సంత స్థలాన్ని ఎంపీపీ హేమలత, మండల ప్రత్యేక అధికారి రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి శైలజారాణి, సర్పంచి వరలక్ష్మి, స్థానిక వైసిపి నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆత్మకూరులో ప్రజా సౌకర్యం కోసం వారాంతపు సంతను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని గ్రామాల నుంచి ప్రజలు, రైతులు వచ్చి సంతలో క్రయవిక్రయాలు చేపట్టేందుకు అనువుగా ఉంటుందన్నారు. అవగాహన కోసం వారాంతపు సంతను నెల రోజులపాటు ఉచితంగా ఏర్పాటు చేస్తామని చెప్పారు. సంత ఏర్పాటు చేసి మొదటి నాలుగు వారాలపాటు అందరికీ ఉచితంగా వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు సౌకర్యంగా ఉండేలా వారాంతపు సంతను ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన కలెక్టర్ నాగలక్ష్మి, రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

టౌన్ బ్యాంకు అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సన్మానం

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు పాలకమండలి అధ్యక్షులుగా ఎన్నికైన సాదు కుళ్లాయిస్వామి, ఉపాధ్యక్షులు చంగల మహేష్‌లతో పాటు డైరెక్టర్లు సాదు వెంకటస్వామి, గిద్దలూరు వెంకటేశులును దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. స్థానిక రామలింగ చౌడేశ్వరి దేవి దేవాంగ కల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చంగల మహేష్, ఉపాధ్యక్షులు మిడతల విశ్వనాథ్, కోశాధికారి నిమ్మల వెంకటరమణ, జాయింట్ సెక్రటరీ ముక్కర బాలచంద్ర, చంగల అమరేష్, సభ్యులు గిద్దలూరు సూర్యనారాయణ, పోసా రామాంజినేయులు, కటికల వెంకటేశులు, పెద్దలు చంగల భోజరాజు, రెడ్డి ఏకాంబరం, కొత్త సోమశేఖర్, నున్నాదాస్, రెడ్డిసూరి తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డికి టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు దిశానిర్దేశం

ప్రజాశక్తి-నార్పల

టిడిపి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ఆలం నరసానాయుడు, శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డికి టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ ఇన్‌ఛార్జిలతో వన్ టూ వన్ కార్యక్రమంలో భాగంగా గురువారం విజయవాడలోని చంద్రబాబు నాయుడు నివాసంలో ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపడుతున్న పార్టీ కార్యక్రమాలను ద్విసభ్య కమీటీ సభ్యులు ఆయనకు అంశాల వారీగా వివరించారు. పార్టీ సభ్యత్వ నమోదు, బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో శింగనమల నియోజకవర్గం కోటపై తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేయడానికి సమాయత్తం కావాలని వారికి చంద్రబాబు సూచించారు. ఎన్నికల సమయం చాలా కీలకమైనది, అవి ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేలా నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని చంద్రబాబు నాయుడు వారికి చెప్పారు. ప్రజల్లోకి వెళ్లి వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడాలని సూచించారు.



ఆలం నరసానాయుడు, కేశవరెడ్డితో మాట్లాడుతున్న చంద్రబాబు